# బాధితులకు సత్వర న్యాయం అందిస్తా..

## ఎస్పీ టి.శ్రీనివాస రావు

- ప్రజావాణిలో 22 ఫిర్యాదులు స్వీకరణ



**గద్వాల జూన్ 15(ప్రజా జ్యోతి ప్రతినిధి):** జోగులాంబ గద్వాల జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన మొత్తం 22 ఫిర్యాదులను

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం 16 జూన్ 2026 ◆ పేజీలు : 5



# గాలి వాన బీభత్సం

- భారీ ఈదురుగాలులకు పారాబైల్డ్ రైస్ మిల్ ధ్వంసం
- సుడిగాలితో కూడిన భారీ వర్షం
- భారీ మిషనరీ,షెడ్డు ధ్వంసం, మిల్లులో నిల్వ ఉంచిన ధాన్యం నీటిపాలు
- పారాబైల్డ్ రైస్ మిల్ కు భారీ నష్టం
- 8 నుంచి 10 కోట్ల భారీ నష్టం
- వర్షం ఈదురుగాలుల సమయంలో రైస్ మిల్లులోనే కార్మికులు
- యాజమాన్యం అప్రమతతతో సురక్షితంగా చేరుకున్న కార్మికులు
- త్రుటిలో తప్పిన కార్మికుల ప్రాణాప్రాయం

**నాగర్ కర్నూల్ జూన్ 15 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నాగర్ కర్నూల్ జిల్లా గుడిపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం భారీ ఈదురుగాలులకు శ్రీ సీతారామాంజనేయ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు లో భారీ ఎత్తున ఆస్తి నష్టం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి రైస్ మిల్లు యజమానులు బిల్లా కంటి రాజ్యలక్ష్మి, రవికుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో ఒక్కసారి సుడిగాలి చుట్టుకోవడంతో రైస్ మిల్లు పై భాగంలోని కప్పు ఇతర మిషనరీ కి సంబంధించిన భారీ పైపులు ఇతర నిర్మాణాలు ఒక్కసారిగా కుప్పకూలాయి. మిషనరీ, రైస్ మిల్ షెడ్డు కుప్ప కూలిపోయింది. దీంతో భారీ ఇనుప పైపులు మిషనరీ మోటర్లు నేలకూలాయి. దీంతోపాటు రైస్ మిల్లులో ప్రాసెసింగ్ లో ఉన్న వడ్లు బియ్యం తడిసి ముద్ద అయ్యాయి.దాదాపు 8 కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు రైస్ మిల్లు యాజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా భారీ సుడిగాలితో కూడిన వర్షం రైస్ మిల్లును చుట్టుముట్టిన సమయంలో యాజమాన్యం వారు అప్రమత్తమై కార్మికులను అందరినీ ఒక చోటికి చేర్చడంతో ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు కార్మికులు పేర్కొన్నారు. ఇంతటి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం రావడం ఒక రైస్ మిల్లు ధ్వంసం కావడంతో ఈ అంశం చర్చనీ అంశంగా మారింది. పూర్తిస్థాయి అంచనా తర్వాతే రైస్ మిల్లుకు జరిగిన నష్టం స్పష్టమయ్యే అవకాశాలు ఉన్నాయి.

# జడ్చర్ల ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడూ?

- ప్రత్యామ్నాయ మార్గం లేక ప్రజల తీవ్ర అవస్థలు



**జడ్చర్ల, జూన్ 15 ( ప్రజా జ్యోతి ):** జడ్చర్ల పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా కల్వకుర్తి, వనపర్తి, నాగర్‌కర్నూల్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ సిగ్నల్ గడ్డ సమీపంలోని రైల్వే వంతెన మీదుగానే ప్రయాణించాల్సి రావడంతో అక్కడ నిత్యం భారీ రద్దీ నెలకొంటోంది. వంతెనపై ఏదైనా వాహనం సాంకేతిక లోపంతో నిలిచిపోవడం, ప్రమాదం జరగడం లేదా ఇతర కారణాలతో రాకపోకలకు అంతరాయం కలిగితే మొత్తం ట్రాఫిక్ వ్యవస్థ స్తంభించిపోతోంది. దీంతో అత్యవసర వైద్య సేవలకు వెళ్లే అంబులెన్సులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులు గంటల తరబడి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రస్తుతం ఈ మార్గానికి ప్రత్యామ్నాయంగా మరో రహదారి అందుబాటులో లేకపోవడం ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. పట్టణం వేగంగా విస్తరిస్తుండటం, వాహనాల సంఖ్య గణనీయంగా

మిగతా 2 లో...

# నిర్లక్ష్యానికి నిదర్శనం
## నీట మునిగిన ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

**గద్వాల (ప్రజా జ్యోతి) జూన్ 15:** గద్వాల జిల్లా, కేటీ దొడ్డి మండలం గంగన్‌పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణం శనివారం కురిసిన వర్షాలకు నీటితో నిండిపోయింది.పాఠశాల ముందున్న సీసీ రోడ్డు ఎత్తుగా నిర్మించడం వల్లే నీరు బయటకు వెళ్లకుండా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.వేసవి సెలవులు అయిపోవడంతో సోమవారం స్కూల్ ప్రారంభించడం జరిగింది. స్కూల్ ఆవరణంలో నీళ్లతో నిండడంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు పాఠశాలలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీటి నిల్వ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.




# కొల్లాపూర్ మున్సిపాలిటీ 9వ వార్డులో పర్యటించిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**కొల్లాపూర్ జోన్ 15 ప్రజాజ్యోతి** కొల్లాపూర్ మున్సిపాలిటీ 9వ వార్డు పర్యటనకు విచ్చేసిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ శ్రీ హేమంత్ కేశవ పాటిల్ గారికి శాలువా కప్పి స్వాగతం తెలిపిన మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీంపాష.సోమవారం ఉదయం 8 గంటలకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ గారు కొల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 9 వార్డులో ఆకస్మిక పర్యటన చేయడం జరిగింది. ఈ యొక్క పర్యటనలో భాగంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించడం జరిగింది. స్వయంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ గారు 9వ వార్డులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు



మిగతా 2 లో...

## జడ్చర్ల ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం ఎప్పుడూ?



(మొదటి పేజీ తరువాయి... )

పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. జడ్చర్ల అభివృద్ధికి అనుగుణంగా ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అదనపు రైల్వే అండర్‌పాస్ లేదా ఓవర్‌బ్రిడ్జి నిర్మాణంతో పాటు ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికతో చర్యలు చేపట్టాలని పట్టణవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ట్రాఫిక్ కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## కొల్లాపూర్ మున్సిపాలిటీ 9వ వార్డులో పర్యటించిన నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



(మొదటి పేజీ తరువాయి... )

సహకారంతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యాయి అని లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ గారితో వారి యొక్క సంతోషాన్ని వ్యక్తం చేశారు.9వ వార్డులో శానిటేషన్ చేస్తున్నటువంటి కార్మికులను కలెక్టర్ గారు ఆప్యాయంగా పలకరించి వారి యొక్క సమస్యల గురించి స్వయంగా వారిని అడిగి తెలుసుకున్నారు. 9వ వార్డు పర్యటన తర్వాత కొల్లాపూర్ మున్సిపాలిటీకి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ ను కలెక్టర్ పరిశీలించారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ పర్యటన కార్యక్రమంలో కొల్లాపూర్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ రెడ్డి జ్యోతి సత్యం మరియు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రహీం పాష కౌన్సిలర్ లు అన్వర్ బోరెల్లి మహేష్ ఖాదర్ బాషా లహరి వేణుగోపాల్ మరియు 9వ వార్డుకు సంబంధించిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మున్సిపల్ కమిషనర్ శంకర్ ఆర్డీవో బన్సీలాల్ మున్సిపల్ ఏఈ విజయ్ మున్సిపాలికి సంబంధించిన అన్ని డిపార్ట్మెంట్ కి సంబంధించిన అధికారులు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



**చిన్నంబావి, జూన్ 15 (ప్రజాజ్యోతి)** చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో సందడి నెలకొంది. బడికి వచ్చిన చిన్నారులకు ప్రధానోపాధ్యాయురాలు అలివేలు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు తొలి రోజే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.కొత్త విద్యాసంవత్సరాన్ని ఉత్సాహంగా ప్రారంభించిన విద్యార్థులతో పాఠశాల ఆవరణ కళకళలాడింది. చిన్నారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అలివేలు, ఉపాధ్యాయులు భరత్, రత్నయ్య, శ్యామల, శివలీల, షబానా తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడేషన్ కార్డులను ఆమోదించిన కలెక్టర్





**నాగర్ కర్నూల్ జూన్ 15 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** నాగర్‌కర్నూల్ జిల్లాలో మీడియా అక్రిడేషన్ ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రెండో విడత అక్రిడేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించి, అర్హులైన జర్నలిస్ట్ కార్డులను ఆమోదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ. రెండో విడత జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అందిన 237 దరఖాస్తులను ఒక్కొక్కటిగా పరిశీలించి, అర్హత ప్రమాణాలను పూర్తి చేసిన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని, జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా నిర్ణయించారు.జర్నలిజం వృత్తి సమాజానికి.. బాధ్యతాయుతమైన సేవ అని, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించే విలేకరులకు ప్రభుత్వం కల్పిస్తున్న అక్రిడేషన్ సదుపాయాలు నిజమైన జర్నలిస్టులకే అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దరఖాస్తుదారుల సేవా వివరాలు, వార్తా ప్రచురణలు, సంస్థల ధృవీకరణ పత్రాలు, పని అనుభవం తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఎటువంటి ఒత్తిళ్లు, సిఫార్సులు లేదా వ్యక్తిగత అభిప్రాయాలకు తావులేకుండా పూర్తిగా నిష్పాక్షికంగా కమిటీ సభ్యులు వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అక్రిడేషన్ వ్యవస్థపై జర్నలిస్టుల్లోనూ, ప్రజల్లోనూ విశ్వాసం పెరిగేలా ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించాలని చెప్పారు.జిల్లాస్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశానికి నాగర్ కర్నూల్ ఆర్టీసీ డిఎం హాజరు కాకపోవడంతో కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పలు దరఖాస్తులపై తమ అభిప్రాయాలు వెల్లడించగా, అర్హతలు, సమర్పించిన పత్రాలు, స్థానిక స్థాయి ధృవీకరణ నివేదికలను పరిశీలిస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కొన్ని దరఖాస్తులపై అదనపు సమాచారం సేకరించి తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి జె కిరణ్ కుమార్, జిల్లా స్థాయి మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ రావు, సురేష్ కుమార్, సాయిలు సాగర్, ప్రదీప్ కుమార్, వెంకట్ స్వామి, దస్తగిరి, మొహమ్మద్ ముబీన్ ఖాన్, శ్రీనివాసులు, నేతాజీ గౌడ్ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీలే చిన్నారుల భవిష్యత్తుకు పునాది

- -అమ్మమాట–అంగన్‌వాడీ బాట'లో సర్పంచ్ బిచ్చన్న





**చిన్నంబావి, జూన్ 15 (ప్రజాజ్యోతి)** చిన్నంబావి: చిన్నారుల సమగ్రాభివృద్ధికి, వారి ఉజ్వల భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలే తొలి మెట్టు అని కొప్పునూర్ సర్పంచ్ వడ్డెమన్ బిచ్చన్న అన్నారు. మండల పరిధిలోని కొప్పునూర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు ఉచిత స్కూల్ యూనిఫాంలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, పూర్వ ప్రాథమిక విద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారుల్లో విద్యా పునాదులను బలోపేతం చేయడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సోని మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సంక్షేమ సేవలు, పోషకాహార కార్యక్రమాల గురించి వివరించారు. చిన్నారుల్లో పోషకాహార లోపాలను నివారించడంలో అంగన్‌వాడీలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఖాజాభాను, మన్నెమ్మ, లక్ష్మి , చిన్నారులు, వారి తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం అందిస్తాం:ఎస్పీ టి.శ్రీనివాసరావు



(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు స్వయంగా స్వీకరించి బాధితులతో నేరుగా మాట్లాడారు.ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ,సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులతో వెంటనే సంప్రదించి చట్టపరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఫిర్యాదుదారులకు ఆలస్యం లేకుండా న్యాయం జరిగేలా పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజల నమ్మకం పోలీసు శాఖకు అత్యంత ముఖ్యమని అన్నారు.ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మంగళవారం నుంచి శనివారం వరకు అన్ని పని దినాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చన్నారు.ఎక్కడైనా న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా స్థాయిలో పోలీసు అధికారులను సంప్రదించాలని సూచించారు.భూ వివాదాలు,ఆస్తి తగాదాలు,కుటుంబ కలహాలు వంటి అంశాల్లో చట్టబద్ధమైన పరిష్కారానికే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు.ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారాన్ని నిరంతరం సమీక్షిస్తూ ప్రజలకు మరింత పారదర్శకమైన,వేగవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు.సోమవారం అందిన ఫిర్యాదుల వివరాలులో కూతుళ్లు అన్నం పెట్టడం లేదంటూ 2,మోసాలకు (చీటింగ్) సంబంధించి 2,గొడవలకు సంబంధించి 4,భూ వివాదాలకు సంబంధించి 12,కుటుంబ వివాదాలకు సంబంధించి 1,ఇతర సమస్యలు 1,చొప్పున మొత్తం 22 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు పారదర్శకమైన,బాధ్యతాయుతమైన,వేగవంతమైన సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# తల్లి తండ్రులు దైవస్వరూపులు

**• సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్.**






**నారాయణపేట ప్రతినిధి జూన్ 15 ప్రజా జ్యోతి** తెలంగాణా రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మరియు చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ మాట్లాడుతూ తల్లిదండ్రులను వారి పిల్లలు గౌరవించాలని, తల్లిదండ్రులు భగవత్ స్వరూపులని, వారిని సేవించుకోవడం మన అదృష్టమని తెలిపారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ప్రాముఖ్యత తగ్గిపోతుందని ఉమ్మడి కుటుంబానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, కానీ ఈ రోజుల్లో అందరూ ఉమ్మడి కుటుంబానికి దూరమవుతున్నారని తెలిపారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ, బాగోగులు, మెయింటెనెన్స్, మందులు, ఆహార అవసరాలను, ఇంట్లో ప్రశాంతత సరైన సపోర్ట్ ఇచ్చి కుటుంబ సభ్యులను జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఈ రోజుల్లో మనుషులకు ఇవ్వాల్సిన సమయాన్ని టీవీలు, ఫోన్లకు కేటాయిస్తూ వృద్ధులను వృద్ధాశ్రమాల్లో వదిలివేస్తున్నారని, వారు కూడా వృద్ధులు అవుతారని, కుటుంబ సభ్యులు కలిసిమెలిసి వృద్ధులకు సమయం కేటాయించి, వారి మనసును బాధపెట్టకుండా చూసుకోవాలని సూచించారు. ఆస్తులు రాయించుకున్న తర్వాత వృద్ధులను హింసించడం, నిరాదరణకు గురిచేయడం, రోడ్లపై వదిలివేయడం వంటి ఘటనలు జరిగితే, బాధిత వృద్ధులు కోర్టును ఆశ్రయించి కేసు వేస్తే, తల్లిదండ్రుల సంరక్షణ మరియు పోషణ చట్టం-2007 ప్రకారం ఆ ఆస్తులు తిరిగి వృద్ధులకే దక్కుతాయి" అని స్పష్టం చేశారు. వృద్ధులకు ఏవైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ట్రోల్ ఫ్రీ నెంబర్ 15100 సంప్రదించాలని, ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి బి. సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్, ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి మురళీధర్, సీనియర్ న్యాయవాది రఘువీర్ లు మాట్లాడుతూ వృద్ధుల సంక్షేమం మరియు వారికి న్యాయపరంగా లభించే చట్టాల గురించి వివరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మి పతి గౌడ్ ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. ఇట్టి సదస్సుకు న్యాయవాదులు జాగ్రతి కమిటీ సభ్యులు కాలప్ప, కుర్మన్న, నారాయణపేట బార్ అసోసియేషన్ న్యాయవాదులు, కోర్టు, లోక్ అదాలత్ సిబ్బంది, పోలీసులు, వయోవృద్ధులు, మహిళలు మరియు కక్షిదారులు పాల్గొన్నారు.

## సంచార జాతులను ఆదుకోవాలి

**• డాక్టర్. ప్రేమ్ కుమార్**



**గద్వాల (ప్రజా జ్యోతి) జూన్ 15:** సంచార జాతులను ఆదుకోవాలి అని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. సంచార జాతి వాళ్ళకు స్థానిక ధృవ పత్రాలు లేక ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారని. జీవించడానికి కనీస సౌకర్యాలు లేకుండా జీవిస్తున్నారని. సొంత స్థలం, సొంత పొలం, వారికి లేదని అన్నారు. అంతే కాక రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, స్థానిక ధ్రువ పత్రాలు లేవని వారి పిల్లలు చదువు కి దూరంగా ఉంటున్నారని వీరికి స్థానిక ధృవ పత్రాలు, రేషన్ కార్డులు ఆధార్ కార్డులు ఇవ్వాలని సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. సంచార జాతులకు ప్రభుత్వం ఇంటి స్థలం, స్థానిక ధృవ పత్రాలు ఇవ్వడం వల్ల వారు స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని ఒకే దగ్గర జీవిస్తూ వారి జీవిత ప్రమాణాలను మెరుగు పరుచుకునే అవకాశం ఉంటుందని, అంతే కాక వారి పిల్లలు చదువు కొనసాగించే అవకాశం ఉంటుందని సామాజిక విప్లవ కారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు.

## ప్రభుత్వ వికలాంగుల బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబ్‌నగర్, జూన్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** మహబూబ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ శారీరక వికలాంగుల బాలుర వసతి గృహంలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు (ప్రీ మెట్రిక్), అలాగే వైకల్యం శాతం 40 శాతం లేదా అంతకంటే ఎక్కువగా ఉన్న అంగవైకల్యాలు, దృష్టి లోపాలు, వినికిడి లోపాలు కలిగిన విద్యార్థులు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు స్థానిక ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం. సదరం సర్టిఫికెట్, అంగవైకల్యానికి సంబంధించిన ఫోటోతో కూడిన పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. వసతి గృహంలో భోజనంతో పాటు వసతి, రెండు జతల దుస్తులు ఉచితంగా అందజేయబడతాయని వెల్లడించారు. దరఖాస్తులు సమర్పించదలిచిన వారు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, మహిళా శిశు వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, కలెక్టర్ కార్యాలయ సముదాయం, రూమ్ నెం.36లో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9010299974 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## అడ్డాకుల నూతన ఎస్ఐగా కె. మురళీధర్ బాధ్యతల స్వీకరణ




**అడ్డాకుల, జూన్ 15 ( ప్రజా జ్యోతి ):** అడ్డాకుల మండల పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన కె. మురళీధర్ సోమవారం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె. మురళీధర్ మాట్లాడుతూ అడ్డాకుల మండల ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, యువత మంచి భవిష్యత్తు దిశగా సాగేందుకు కృషి చేస్తామని చెప్పారు. గంజాయి, మాదకద్రవ్యాలు లేని మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరి సహకారంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలైనా నిస్సంకోచంగా తనను సంప్రదించవచ్చని, శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్డాకుల గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి, మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, జి. విజయమోహన్ రెడ్డి, సీనియర్ నాయకుడు షఫీ, కురుమూర్తి సొసైటీ డైరెక్టర్ వేగనాద్, దేవరకద్ర నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ప్రేమ్‌కుమార్, రవీందర్ రెడ్డి, పరుశురాం, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్, అడ్డాకుల టౌన్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు. నూతన ఎస్ఐ మురళీధర్ మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి శాంతి భద్రతలను కాపాడుతారని ఆశాభావం వ్యక్తం చేస్తూ నాయకులు అభినందనలు తెలిపారు.

## ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణకై సెప్టెంబర్ 1న దేశవ్యాప్త ఆందోళన

**• సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ**

**మహబూబ్‌నగర్, జూన్ 15 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సెక్యులరిజాన్ని పరిరక్షించేందుకు సీపీఐ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ నారాయణ తెలిపారు. సీపీఎం మాజీ పార్లమెంట్ సభ్యుడు మధు సతీమణి సుమతిని పరామర్శించేందుకు సోమవారం మహబూబ్‌నగర్‌కు వచ్చిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. మతోన్మాదం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనబెట్టి హిందుత్వ ఎజెండాను అమలు చేస్తోందని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ దేశవ్యాప్త ఉద్యమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడిచినా ప్రజా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు కుల, మత రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజా ఆగ్రహం కారణంగానే బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ వంటి దేశాల్లో ప్రభుత్వాలు కుప్పకూలిన పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. దేశంలో న్యాయవ్యవస్థ, ఎన్నికల వ్యవస్థ, సీబీఐ వంటి సంస్థలపై ప్రజల విశ్వాసం క్రమంగా తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసే రాజకీయ పార్టీలను భవిష్యత్తులో ప్రజలు తిరస్కరించే పరిస్థితి వస్తుందని అన్నారు. ప్రజల్లో కమ్యూనిస్టు పార్టీల పట్ల విశ్వాసం ఉన్నప్పటికీ, ఆ విశ్వాసాన్ని ఓట్లు, సీట్లుగా మలుచుకోవడంలో కమ్యూనిస్టు పార్టీలు విఫలమవుతున్నాయని అంగీకరించారు. ఈ లోపాలను అధిగమించి పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ సంపదను పెట్టుబడిదారుల వర్గాలకు కట్టబెట్టే విధానాలను ఎండగడుతూ, కార్మిక వర్గ ప్రయోజనాలు, దేశ సమగ్రత, ప్రజా శ్రేయస్సు కోసం కమ్యూనిస్టులు వాచ్‌డాగ్‌లా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బృంగి బాలకిషన్, మాజీ జిల్లా కార్యదర్శి బి. పరమేశ్ గౌడ్, నాయకులు పద్మావతి, సత్యనారాయణ రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

**• స్థానిక ఎస్సై కురుమూర్తి**



**కల్వకుర్తి జూన్ 15 ( ప్రజా జ్యోతి ):** అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై కురుమూర్తి పేర్కొన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని రఘుపతి పేట గ్రామం రామగిరి వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. సోమవారం వాహనాలను పట్టుకొని పోలీస్ స్టేషన్కు తరలించి టిప్పర్ డ్రైవర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీపై చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణిలో తహసీల్దార్ కు బీసీ జాగృతి సేన వినతి




**జడ్చర్ల, జూన్ 15 ( ప్రజా జ్యోతి ):** ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులపై అధిక ఫీజుల భారం మోపుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ జాగృతి సేన నాయకులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో తహసీల్దార్ నర్సింగ్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ జాగృతి సేన మండల అధ్యక్షుడు గౌడుగు నర్సిములు మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు.కొన్ని పాఠశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా భవనాల మొదటి అంతస్తుల్లో తరగతి గదులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతను పక్కనబెట్టి పాఠశాలల నిర్వహణ జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) ప్రకారం నిరుపేద విద్యార్థులకు కల్పించాల్సిన ఉచిత ప్రవేశాలను అనేక పాఠశాలలు అమలు చేయడం లేదని ఆరోపించారు. అలాగే స్కూల్ యాజమాన్యాలు డ్రెస్సులు, పాఠ్యపుస్తకాలు పాఠశాలలలోనే విక్రయిస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నాయని తెలిపారు. జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ జాగృతి సేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి సేన జిల్లా నాయకుడు మాచారం శ్రీనివాస్, కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సురభి విజయ్‌కుమార్, మండల కార్యదర్శులు సురభి రఘు, చెన్నయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల రాకతో అంగన్వాడి కేంద్రాలలో పండుగ వాతావరణం




మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో అంగన్వాడి టీచర్లు మరియు ఆయాలు ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని ఉత్సాహంగా సోమవారం రోజు నిర్వహించారు జూన్ 15వ తేదీ నుంచి పాఠశాలలు పున ప్రారంభం కానున్న నేపథ్యంలో చిన్నారులకు ఘనంగా స్వాగతం పలుకుతూ తల్లిదండ్రులలో విద్య పట్ల అవగాహన కల్పించారు. బుడిబుడి అడుగులతో పాఠశాలలకు అడుగుపెట్టనున్న చిన్నారులకు అంగన్వాడీ టీచర్లు మరియు ఆయాలు ఆహ్వానం పలికి ఆనంద ఉత్సవాల మధ్య కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్య ఎంతో కీలకమని ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫాములు మధ్యాహ్న భోజన పథకం వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు పాఠశాలలకు దూరంగా ఉన్న పిల్లల్ని గుర్తించి వారిని తిరిగి బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు బడిబాట కార్యక్రమాల ద్వారా గ్రామాలలో విద్యా పట్ల సానుకూల వాతావరణం నెలకొల్పడంతో పాటు చిన్నారులలో పాఠశాలపై ఆసక్తిని పెంపొందించేలా అంగన్వాడి సిబ్బంది కృషి చేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు. కమల, మహేశ్వరి,సువర్ణ, సుగుణ బాయ్, ఎల్లమ్మ, కృష్ణవేణి, పారిజాత, మాధవి,లక్షి , చంద్రకళ, తిరుపతమ్మ,వరాలు, ఆయాలు ఉడుత రాధమ్మ, నీరజ, లచ్చుమ్మ, చెన్నమ్మ, గీత, కృష్ణవేణి, స్వప్న చంద్రకళ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా మిగిలిన రోడ్డును పూర్తిచేయాలి

- సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ పార్టీ పాదయాత్ర ప్రారంభం

**నారాయణపేట ప్రతినిధి జూన్ 15 ప్రజా జ్యోతి**

పల్లి –కోటకొండ –కోయిలకొండ మధ్యన అసంపూర్తిగా మిగిలిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈరోజు కోటకొండ నుంచి నారాయణపేట వరకు పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్ర కోటకొండ సెంటర్ లోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ప్రారంభ సభకు మాస్ లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ అధ్యక్షత వహించగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అన్వేష్ మాట్లాడుతూ. ఈ రోడ్డును పూర్తి చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి అన్నారు ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించిన రోడ్డు ప్రభుత్వం మారిపోయి కొత్త ప్రభుత్వం వచ్చినా కూడా పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదు అన్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే గారు జవాబు చెప్పాల్సిన అవసరం ఉంది అన్నారు. రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోవడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు చదువులు కొనసాగించడం ఇబ్బందిగా ఉంది అన్నారు ఇక్కడ నుంచి మహబూబ్నగర్, నారాయణపేట్ వెల్లె వ్యాపారస్తులైన, విద్యార్థులైన వేరే ఉపాధి వెతుక్కునే యువకులైన ఉద్యోగస్తులకైన చాలా ఇబ్బందిగా మారింది అన్నారు ఆర్టీసీ వాళ్లు బస్సు నడపాలి అంటే ఈ ప్రాంతం నుండి వచ్చే ఆదాయం కంటే బస్సు రిపేర్ కి ఎక్కువ ఖర్చు అవుతున్నది అందుకే బస్సులు నడపడం లేదని అంటున్నారు. ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే ఆ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు నీళ్లు ముఖ్యమైనవి కానీ ఇవి కల్పించడంలో గత ప్రభుత్వాలు నేటి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉంటున్నాయి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు రోడ్డు పూర్తి చేస్తామని హామీలు ఇచ్చాయి హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా కూడా వాటిని పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదు అన్నారు





కావున ఇప్పటికైనా ఈ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎమ్మెల్యే గారు కాంగ్రెస్ పార్టీ అయినా లేదా కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ఎంపీడీకే అరుణ గారు అయినా ఈ రోడ్డుని పూర్తి చేసే అవకాశం ఉన్నది కానీ వాళ్లు నిర్లక్ష్యంగా ఉంటూ ప్రజలపై రాజకీయాలు చేస్తున్నారు అన్నారు కావున వాళ్లు చిత్తశుద్ధితో వెంటనే రోడ్డు పూర్తి చేసి ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని కోరుతున్నామన్నారు లేనిచో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ పాదయాత్రలో సిపిఐఎం జిల్లా కార్యదర్శి వెంకట్ రాంరెడ్డి, మాస్ లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.రాము, తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివ వీరన్న, జిల్లా అధ్యక్షులు కృష్ణ, బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగల శ్రీనివాస్, మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. కోటకొండా మాజీ ఎంపీటీసీ లు సునీత, సరళ, మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకులు జయ, బోయిన్ పల్లి రాము, యాదగిరి, బి.నరసింహ పి.రామకృష్ణ, కొండ నరసిములు, చెన్నారెడ్డి, డివిజన్ నాయకులు హాజీ, ఎదిరింటి నర్సిం లు, ప్రతాప్, వెంకట్రములు, అంజి, బాలకృష్ణ, ప్రశాంత్, నారాయణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు

- హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్



**మహబూబ్ నగర్, జూన్ 15 (ప్రజా జ్యోతి బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ సోమవారం హైదరాబాద్ లోని వారి నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం భట్టి విక్రమార్క చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఒబేదులా కోత్వాల్, జిల్లా ఎస్సీ డిపార్ట్ మెంట్ అధ్యక్షుడు పాసుల రాజుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిరంతర సామాజిక సేవ కోసం, రక్త దానాల ప్రేరణకోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఐఆర్సిఎస్ లో సభ్యత్వం తీసుకోండి

- జిల్లా అడిషనల్ కలెక్టర్ ఐఆర్సిఎస్ జిల్లా వైస్ చైర్మన్ పిలుపు.



**నారాయణపేట ప్రతినిధి జూన్ 15 (ప్రజా జ్యోతి)** ఈరోజు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిన్నటి (14th June) ప్రపంచ రక్త దాన దినోత్సవం పురస్కరించుకొని సభ్యత్వ డ్రైవ్ లో భాగంగా ఈరోజు ఐఆర్సిఎస్ జిల్లా ఇన్ కన్వీనర్ సుదర్శన్ రెడ్డి గారి ద్వారా ఇప్పటికే జిల్లాలో అత్యధిక సార్లు దాదాపు 67 సార్లు రక్తదానం చేసినకేంద్ర ప్రభుత్వ న్యాయవాది రఘువీర్ యాదవ్ ఈరోజు జీవిత సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఆయన తీసుకోవడమే కాకుండా తన మిత్రులు మరో ఇద్దరిని ఈరోజు ఐఆర్సిఐ లైఫ్ మెంబర్స్ గా చేర్పించినారు. ఈ సందర్భంగా వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ జిల్లా వైస్ చైర్మన్ & అడిషనల్ డిస్టిక్ కలెక్టర్ శ్రీ శ్రీను గారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అనే అనేక రకాల ప్రమాదాలు యుద్ధాలు తదితర సమస్యల ఫలితంగా అవసరం పడిన రోగులకు కానీ సైనికులు సైనికులకు గాని ప్రజలకు గాని అత్యవసర సమయాలలో రక్తపు అవసరాలను తీర్చడానికి గాను దేశవ్యాప్తంగా ఐఆర్సిఎస్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న సభ్యత్వపు డ్రైవ్ లో ప్రజలందరూ పాలుపంచుకోవాలని ముఖ్యంగా ఉద్యోగులు యువకులు సామాజిక కార్యకర్తలు ఐఆర్సిఎస్ లో సభ్యత్వం తీసుకొని రక్తదాతలను ప్రోత్సహించి వారిని ప్రాణదాతలుగా చేయడంలో భాగంగా జరుగుతున్న ఐఆర్సిఎస్ సభ్యత్వం డ్రైవ్ లో ఈ వారం రోజుల లోపల సభ్యత్వం తీసుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు సభ్యులుగా చేరిన వారిని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

